
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



ఇద్దరు వలంటీర్ల తొలగింపు

మెళియాపుట్టి, ఏప్రిల్ 3: మెళియాపుట్టి మండలం గొప్పిలి గ్రామానికి చెందిన ఇద్దరు గ్రామ వలంటీర్లను తొలగించినట్లు ఎంపీడీవో జి.భాస్కరరావు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే రెడ్డిశాంతి కూమారుడు రెడ్డి శ్రావణ్‌కూమార్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీర్ కొయ్యాన సీతారాం పాల్గొన్నాడు. అలాగే మరో వలంటీర్ తులసి సురేష్ వైసీపీకి సంబంధించి పోస్టులను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నాడు. వీటిపై టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేసి వాస్తమేనని నిర్ధారించడంతో ఆ ఇద్దరు వలంటీర్లను తొలగించామని ఎంపీడీవో భాస్కరరావు తెలిపారు.

'పింఛన్ల పంపిణీకి డబ్బులకేం ఇబ్బంది లేదు. సరిపడా ఉంది. ఎలాంటి లోటుపాట్లు లేకుండా లబ్ధిదారులకు పంపిణీ చేస్తాం'.. మూడు రోజుల క్రితం ప్రభుత్వ పెద్దలు ఆర్భాటంగా చేసిన ప్రకటన ఇది. పింఛన్‌దారుల డబ్బులు ప్రభుత్వం మళ్లించిందంటూ టీడీపీ నేతలు మొదటి నుంచీ చెబుతున్నారు. లబ్ధిదారులను ఇబ్బంది పెట్టి నెపం తమపై నెట్టేందుకు యత్నిస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చివరకు అదే జరిగింది. బుధవారం ప్రభుత్వం బ్యాంకులకు అరకొరగా నగదు జమచేసి వృద్ధులు, వికలాంగులను తీవ్ర ఇబ్బంది పెట్టింది. బ్యాంకుల నుంచి సచివాలయాలకు సరిపడా డబ్బులు రాకపోవడంతో లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. దీంతో కొంతమంది ప్రభుత్వంపై శాపనార్థాలు పెట్టారు. ఇదంతా ప్రభుత్వం కావాలనే చేసిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విపక్షంపై విషం చిమ్మేందుకు ఈ నాటకాలడుతోందని పలువురు విమర్శిస్తున్నారు.



పింఛన్ డబ్బుల్లేవ్



సాయంత్రమైనా డబ్బులు రాకపోవడంతో టెక్కలి మండలం నర్సింగపల్లి సచివాలయం వద్ద పింఛన్‌దారుల నిరీక్షణ

- బ్యాంకుల్లో అరకొరగా జమ.. లబ్ధిదారుల అవస్థలు
- సచివాలయాల వద్ద పడిగాపులు.. కొంతమందికే పంపిణీ
- ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేసినట్లు ఆరోపణలు
- విపక్షంపై విషం చిమ్ముతున్న వైసీపీ నాయకులు
- తమ తప్పులను కప్పి పుచ్చుకునేందుకు నానాపాట్లు

శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి/టెక్కలి, ఏప్రిల్ 3

జిల్లాలో సామాజిక భద్రత పింఛన్ పంపిణీ 30.29 శాతం మాత్రమే జరిగింది. ప్రభుత్వం ముందుగా మరో కార్యక్రమానికి నిధులు మళ్లించడం.. సరైన ప్లానింగ్ లేకుండా.. ఆలస్యం అయిన విషయాన్ని ప్రతిపక్షాలపై నెట్టేసేలా విషప్రచారానికి వైసీపీ నేతలు దిగిన విషయం తెలిసిందే. దీన్ని తిప్పికొట్టేలా టీడీపీ నాయకులు ఊరూరా.. తిరిగి జగన్నాటకాన్ని వివరించారు. దీంతో పోటాపోటీగా సామాన్యులు సైతం వైసీపీ అభిమానులతో వాదనలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా... జిల్లా వ్యాప్తంగా పింఛన్లు మొత్తం 3,21,662 ఉన్నాయి. ఇందులో బుధవారం సాయంత్రం నుంచి పంపిణీ మొదలు పెట్టారు. ఉదయం నుంచే పలువురు పింఛన్‌దారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. కొన్ని సచివాలయాల్లో థంబ్ సేకరించి.. రేపు రావాలని చెప్పారు. మరికొన్నిచోట్ల.. సచివాలయ ఖాతాల్లో సాయంత్రం నాటికి డబ్బులు జమ కాకపోవడంతో.. వెనక్కి పంపారు. రాత్రి 8 గంటల సమయంలో సచివాలయ ఖాతాల్లో డబ్బులు జమఅయ్యాయి. రాత్రి 8 గంటల సమయానికి 94,129 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇంకా 2,27,560 మందికి రెండురోజుల్లో పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం బ్యాంకులకు అరకొరగా పింఛన్ డబ్బులు జమచేయడంతో సచివాలయ సిబ్బంది కొంత మందికే పింఛన్లు అందజేశారు. ఇదిలా ఉండగా.. కొన్నిచోట్ల సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ ఆలస్యానికి టీడీపీ నేతలే కారణమని వైసీపీ నాయకులు పింఛన్‌దారులకు మభ్య పెట్టే ప్రయత్నం చేశారు. కాగా.. పింఛన్లకు కేటాయించిన నగదు మున్సిపల్ ఎడ్మినిస్ట్రేషన్ బిల్లుల కింద ఎందుకు చెల్లించారంటూ టీడీపీ నేతలు నిలదీయడంతో ఖంగుతిన్నారు.



శ్రీకాకుళం రిమ్స్ సమీపంలోని సచివాలయం వద్ద..



ఇచ్ఛాపురం: డబ్బులు రాకపోవడంతో బెల్లుపడ సచివాలయంలో నిరీక్షణ

ఇచ్ఛాపురంలో 11 శాతమే..

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో పది సచివాలయాల పరిధిలో 4,250 మంది పింఛన్‌దారులు ఉన్నారు. పింఛన్ల రూపంలో వీరికి రూ.1,25,41,000 చెల్లించాలి. ఇచ్ఛాపురం మండలంలో 16 సచివాలయాల పరిధిలో 7,421 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి రూ.2,19,16,000 చెల్లించాలి. బుధవారం ఉదయం 10 గంటలకే పింఛన్‌దారులు సచివాలయాల వద్దకు చేరుకున్నారు. ఖాతాలో ఇంకా పింఛన్ డబ్బులు జమకాలేదని మళ్లీ రావాలని సచివాలయ సిబ్బంది చెప్పడంతో వెళ్లిపోయారు. మళ్లీ మధ్యాహ్నం రాగా.. అప్పటికీ డబ్బులు జమ కాలేదని చెప్పడంతో సచివాలయాల వద్దే కొంతమంది నిరీక్షించారు. బెల్లుపడ, బెల్లుపడ కాలనీ తదితర సచివాలయాల్లో వృద్ధులు, దివ్యాంగులు పడిగాపులు కాశారు. సాయంత్రానికి కొంత డబ్బులు మాత్రమే జమకావడంతో.. కొందరికే పింఛన్లు అందజేశారు. బుధవారం 11 శాతం మాత్రమే పంపిణీ చేశామని మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్, ఎంపీడీవో జగదీష్ తెలిపారు.

- టెక్కలి మండలం నర్సింగపల్లి సచివాలయం పరిధి 492 మంది పింఛన్‌దారులకు రూ.15.23 లక్షలు చెల్లించాలి. వీరిలో కొంతమంది లబ్ధిదారులు బుధవారం ఉదయం నుంచీ సచివాలయం వద్ద పింఛన్ కోసం నిరీక్షించారు. కాగా.. బుధవారం కేవలం రూ.6.15 లక్షలు మాత్రమే పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమైంది. సాయంత్రం 5గంటల వరకు సంబంధిత బ్యాంకుల వద్ద సచివాలయ సిబ్బంది వేచిచూశారు. చివరకు రూ.6.15 లక్షలు తెచ్చి.. సచివాలయం దగ్గర పడిగాపులు కాసిన కొంతమంది లబ్ధిదారులకు మాత్రమే పింఛన్ అందజేశారు.
- టెక్కలి మండలంలో 20 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో బుధవారం సాయంత్రం 5 గంటల సమాయానికి కేవలం ఆరు సచివాల యాలకు మాత్రమే పూర్తిస్థాయిలో పింఛన్ డబ్బులు బ్యాంకు ఖాతాలో పడ్డాయి. కొన్ని సచివా లయాలకు లక్ష రూపాయలు లోపే నగదు జమకావడం గమనార్హం.



పోలాకి : తోటాడలో రాత్రి వరకు పింఛన్ కోసం పాట్లు

రాత్రి వరకు పడిగాపులు

పోలాకి: పోలాకి, పోలాకి-2, గొల్లల వలస, తోటాడ గ్రామాల్లో పింఛన్ల పంపిణీ మధ్యాహ్నం 3 నుంచి ప్రారంభమైంది. రాత్రి వరకు లబ్ధిదారులు పడిగాపులు కాశారు.



శ్రీకాకుళం పొట్టిశ్రీరాములు జంక్షన్‌లో సచివాలయం వద్ద..

వేలిముద్రలు వేయించుకొని పంపించేశారు..

జలుమూరు: జలుమూరు మండలంలోనూ పింఛన్‌దారులకు అవస్థలు తప్ప లేదు. సచివాలయాల వద్ద పింఛన్ కోసం సాయంత్రం వరకూ ఎదురు చూసి నిరాశతో ఎదురుతిరిగారు. చల్లవానిపేట సచివాలయంలో సిబ్బంది పింఛన్‌దారుల నుంచి వేలిముద్రలు వేయించుకొని.. డబ్బులు ఇంకా జమకాలేదని తర్వాత పింఛన్లు అందజేస్తామని చెప్పి పంపించేశారు. సాయంత్రం 6 గంటల వరకు పింఛన్ల పంపిణీ చేపట్టలేదు.



జలుమూరు : లింగాలవలస సచివాలయానికి డబ్బులు రాక ఎదురుచూపు

ప్రచారానికి అనుమతి తప్పనిసరి

- 14 వరకు ఓటు నమోదుకు అవకాశం: కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఏప్రిల్ 3: రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేపట్టబోయే ఎలాంటి ప్రచారానికైనా సంబంధిత ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. లోక్‌సభకు జిల్లా ఎన్నికల అధికారి, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి అక్కడి ఆర్వోలు అనుమతి ఇస్తారని తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియామాలపై రాజకీయ పార్టీలకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రచార అనుమతులకు దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో ఏకగవాక్ష విధానం ద్వారా అనుమతులు ఇస్తామన్నారు. వివరాలు సక్రమంగా ఉంటే 24 గంటల్లో కూడా అనుమతులు జారీ చేస్తామని తెలిపారు. సువిధ యాప్‌లో లేదా ఎంపీ అభ్యర్థులు కలెక్టరేట్‌లోని సింగిల్ విండో విభాగంలో, ఎమ్మెల్యే అభ్యర్థులు ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇప్పటివరకు 150కిపైగా దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. ఈ నెల 14 వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు ఫారం-6 సమర్పించవచ్చన్నారు. సి-విజిల్ బృందాలకు ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లోనే 95శాతం పరిష్కరించామన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

రెండు లక్షల నగదు స్వాధీనం

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 3: వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి జంక్షన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బుధవారం తనిఖీ నిర్వహించారు. నువ్వలరేవు గ్రామానికి చెందిన బెహరా మోహనరావు స్కూటీలో రూ.2లక్షల నగదును అధికారులు గుర్తించారు. వాటికి సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి వనిత తెలిపారు.

విలువలు, విశ్వసనీయతలేని వైసీపీ

- అక్కడంతా అవినీతిపరులు, సంస్కారహీనులకే చోటు
- జగన్‌ను సొంత తమ్ముడిగా భావించా.. మోసం చేశారు
- పార్టీలో చేరినప్పుడు క్యాబినెట్ ర్యాంకు ఇస్తామన్నారు
- కనీసం ఎంపీగా పోటీచేసే అవకాశమూ ఇవ్వలేదు
- కార్యకర్తలా కష్టపడ్డాను.. కనీస గౌరవం లేకపోతే ఎలా?
- ఆత్మగౌరవాన్ని చంపుకోలేకే పార్టీకి రాజీనామా చేస్తున్నా
- కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి

శ్రీకాకుళం అర్బన్, ఏప్రిల్ 3: 'విలువలు, విశ్వసనీయత, సంస్కారవంతులు, విద్యావంతులు, నీతిపరులకు వైసీపీలో చోటు లేదు. రెబల్స్, అవినీతిపరులు, సంస్కారహీనులు, విద్యాహీనులు, బూతుపురాణం వారికి మాత్రమే ఆ పార్టీలో చోటు, గౌరవం లభిస్తుంద'ని కేంద్రమాజీ మంత్రి, వైసీపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు కిల్లి కృపారాణి ఆరోపించారు. కార్యకర్తలా కష్టపడినా కనీసం గౌరవం లేదని, ఆత్మగౌరవాన్ని చంపుకోలేక.. అవమానాలు ఎదుర్కోలేక వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో విలేకరుల ముందు తన ఆవేదనను వెళ్లగక్కారు.

- 'సీఎం జగన్‌ను తమ్ముడిగా భావించి ఆయనపై నమ్మకంతో తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీని వీడి 2019లో వైసీపీలో చేరాను. ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి కేబినేట్ ర్యాంకు ఇస్తామని జగన్ హామీ ఇచ్చారు. దీంతో నా వెంట ఉన్నవారికి ఏదైనా మంచి చేద్దామని భావించాను. కానీ, పార్టీలో ఎన్నో అవమానాలు ఎదురయ్యాయి. వాటిని దిగమింగుకుని పార్టీ కోసం కార్యకర్తలా పనిచేశాను. అయినా కనీసం గౌరవం దక్కలేదు. 2019లో ఎంపీగా పోటీ చేయాలని విజయసాయిరెడ్డి చెప్పారు. కానీ అభ్యర్థుల జాబితాలో సీఎం జగన్ నా పేరు వెల్లడించలేదు. తర్వాత పార్టీలో మంచి స్థానం కల్పిస్తామని జగన్ హామీ ఇచ్చారు కానీ, తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా నన్ను ఎందుకు నియమించారో.. ఎందుకు తొలగించారో కూడా అర్థం కాలేదు. ఒక్క వలంటీర్‌ను నియమించే అవకాశం కూడా కల్పించలేదు. నేను మద్దతు ఇచ్చిన వ్యక్తిని కాదని, సీఎం బొమ్మ పెట్టి మరో వ్యక్తిని ఇండిపెండెంట్‌గా నియమించి సొంత పార్టీ నాయకులే పోటీ చేయించారు. గతంలో జగన్ జిల్లాకు వచ్చినప్పుడు హెలీప్యాడ్ వద్దకు వెళ్తే ఆయనను కలవనీయకుండా అడ్డుకున్నారు. జిల్లా ప్రజలు ఎంతగానో ఆదరించిన నన్ను.. సొంతపార్టీ నేతలే ఎందుకిలా అవమానిస్తున్నారో అర్థం కావడం లేదు' అని కృపారాణి కన్నీటిపర్యంతమయ్యారు.
- 'పార్టీలోని పరిణామాలను, అవమానాలను విజయసాయిరెడ్డికి, వైవీ సుబ్బారెడ్డికి విన్నవించాను. సీఎం జగన్‌ను కలిసే అవకాశం ఇమ్మని ప్రాథేయపడినా వారు పట్టించుకోలేదు. ప్రస్తుత ఎన్నికల్లో మా నియోజకవర్గంలోని వైసీపీ తరపున ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారు. ఆ ఇద్దరు తమ్ముళ్లు కనీసం సహకరించమని కూడా నన్ను అడగలేదు. దీంతో పార్టీలో నా స్థానం అర్థమైంది. నన్ను పథకం ప్రకారం అణగదొక్కాలని చూశారు. నాలాగే సుమారు 136మంది సర్పంచ్‌లు కూడా అవమానించబడుతున్నారు. నియోజకవర్గంలో కొంతమంది వైసీపీ నాయకులు.. కృపారాణి పనైపోయిందని అవమానించడం బాధాకరం. విలువలు, విశ్వసనీయత ఉన్నవారికి వైసీపీలో గౌరవం దక్కదు. అందరికీ పదవులు రావు. పదవుల కన్నా గౌరవం మిన్న. అటువంటి గౌరవం లేని పార్టీలో ఆత్మగౌరవం చంపుకుని ఉండలేము. నాకు జరిగిన అన్యాయంపై 3 నెలల కిందట స్పీకర్ సీతారాం సాక్షిగా సీఎం జగన్‌కు లేఖ ఇచ్చాను. ఇంతవరకూ పిలుపు రాలేదు. ఇక ఈ అవమానాలు భరించలేక వైసీపీకి రాజీనామా చేస్తున్నా' అని కృపారాణి తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్, టీడీపీలు తనను ఆహ్వానిస్తున్నా యని, ఎక్కడ గౌరవం లభిస్తే ఆ పార్టీలో చేరుతానన్నారు. వైసీపీ నేతలకు తన బలమేంటో చూపిస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో కిల్లి రామ్మోహన్‌రావు, మాజీ ఎంపీటీసీ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిల్లి కృపారాణి

ఎస్‌బీఐ ఆర్‌ఎం రాజుపై బదిలీ వేటు

- నరసన్నపేట బ్రాంచ్‌లో రుణాల కుంభకోణమే కారణమా?
- కొత్త ఆర్‌ఎంగా అబ్దుల్ హసీబ్ అమీర్ బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 3: జిల్లాలోని వివిధ ఎస్‌బీఐ బ్యాంకు కార్యాలయాల్లో కొంత కాలంగా వెలుగుచూస్తున్న కుంభకోణాల నేపథ్యంలో ఆర్‌ఎం టి. రాజుపై బదిలీ వేటు పడింది. కొన్ని నెలల కిందట గార ఎస్‌బీఐ బ్రాంచ్‌లో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలు మాయం కాగా, నిందితులను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే నరసన్నపేటలోని బజార్ బ్రాంచ్ కార్యాలయంలో బినామీల పేరుతో రుణాలు మంజూరు చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గార బ్యాంకులో జరిగిన ఘటన అనంతరం జిల్లాలోని ఎస్‌బీఐ అన్ని బ్రాంచ్‌ల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో నరసన్నపేట బజారు బ్రాంచ్‌లో లోపాలను గుర్తించినట్లు తెలు స్తోంది. గార బ్యాంకులో మాదిరిగానే ఇక్కడ కూడా ఉద్యోగులను బలిపశువులను చేయాల నుకున్నారు. ఎస్‌బీఐలో రీజనల్ స్థాయి అధికారి నిర్లక్ష్యంతోపాటు అతని పాత్ర ఉందన్న అను మానాలు వ్యక్తమయ్యాయి. శ్రీకాకుళం రీజనల్ మేనేజర్ టి.రాజును మంగళవారం రాత్రి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన స్థానంలో బొబ్బిలిలో ఆర్ఎంగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ హసీబ్ అమీర్‌ను శ్రీకాకుళంలో నియమించారు. తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశించారు. బుధవారం ఉదయమే అబ్దుల్ హసీబ్ అమీర్ బాధ్యతలు చేపట్టారు. ఈ విషయమై బ్యాంకు సిబ్బందిని, యూనియన్ నాయకులను సంప్రదించగా అంతా తమ మంచికే జరిగిందని చెప్పడం కొసమెరుపు. ప్రస్తుతం బదిలీ అయిన ఆర్‌ఎం రాజు విశాఖపట్నంలోని ఎస్‌బీఐ జోనల్ కార్యాలయానికి రిపోర్ట్ చేయగా.. ఆయనకు ఇంకా పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది.

రెండు ఆలయాల్లో చోరీ

- వెండి వస్తువులతోపాటు రూ.11 లక్షల అపహరణ
- దుండగుల కోసం పోలీసుల గాలింపు

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 3: వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం శివాలయం, అయ్యప్పస్వామి దేవాలయాల్లో వెండి వస్తువులు, హుండీలో నగదు చోరీ అయ్యాయి. ఆలయ ధర్మకర్త కొంచాడ ధర్మారావు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పురోహితులు బుధవారం వేకువజామున ఆలయానికి వచ్చి చూడగా గర్భగుడిలో తలుపులు తీసి ఉన్నాయి. దీంతో చోరీ జరిగినట్టు గుర్తించి ధర్మకర్తకు సమాచారం అందజేశారు. గ్రామపెద్దలు కూడా ఆలయం వద్దకు చేరుకున్నారు. హుండీలు, సీసీ కెమెరాలు ధ్వంసమై కనిపించాయి. శివాలయంలో వెండి నాగాభరణం, ధారాపాత్ర, మూడు శఠగోపాలు, వెండి పళ్లెం, రెండు దీపపు కుందులు చోరీకి గురయ్యాయి. అయ్యప్పస్వామి ఆలయంలో ఉద్ధరిని, పంచపాత్ర, శఠగోపంతోపాటు ఆరున్నర కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. మంగళవారం అర్ధరాత్రి ఆలయాల వెనుక భాగంలో ప్రహరీ పైనుంచి దుండగులు లోపలికి ప్రవేశించి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. దొంగలు ఆలయాల్లో ఉన్న సీసీ టీవీ పుటేజ్‌కు సంబంధించిన డీవీఆర్‌లు కత్తిరించి తీసుకెళ్లినట్టు గుర్తించారు. రెండు ఆలయాల్లో సామగ్రితోపాటు మొత్తంగా రూ.11లక్షల వరకు దొంగిలించారని స్థానికులు పేర్కొంటున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ రామారావు సందర్శించి వివరాలు సేకరించారు. శ్రీకాకుళం నుంచి ఎస్ఐ భరత్ ఆధ్వర్యంలో క్లూస్‌టీం సిబ్బంది వచ్చి తనిఖీలు చేశారు. కానీ, ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఆలయం వెనుకభాగంలో రక్తపు మరకలు కూడా ఉండడంతో వాటి నమూనాలు కూడా సేకరించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామారావు తెలిపారు. దొంగల కోసం గాలిస్తున్నామన్నారు.



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్, పోలీసులు

పనిచేసిన చోటే.. కుప్పకూలి..

వడదెబ్బకు గురై ఉపాధికూలీ మృతి

ఆమదాలవలస, ఏప్రిల్ 3: ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామంలో బుధవారం వడదెబ్బకు గురై ఉపాధిహామీ కూలీ గరుగుబెల్లి రాజులమ్మ(62) మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామానికి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న సత్తిబంద చెరువు వద్ద ఉపాధి పనులకు రాజులమ్మ తోటి కూలీలతో కలిసి వెళ్లింది. పనులు ప్రారంభించిన కొద్ది సేపటికే కుప్పకూలిపోయింది. తోటి కూలీలు సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. వడదెబ్బ కారణంగా ఆమె మృతి చెందినట్టు స్థానిక వైద్యులు గుర్తించారు. ఈ విషయాన్ని ఉపాధిహామీ క్షేత్ర సహాయకురాలు, టీడీపీ నాయకుడు ఢిల్లీశ్వరరావు, ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, ఉపాధిహామీ అధికారులకు సమాచారం ఇచ్చారు. కొర్లకోట గ్రామానికి ఏపీవో చేరుకొని మృతురాలి వివరాలు సేకరించారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయం అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు.



రాజులమ్మ మృతదేహం, ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో

నౌపడా జంక్షన్‌లో సమస్యల కూత

- కనీస సదుపాయాలు మృగ్యం
- పలు ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ లేదు
- ఇబ్బందులు పడుతున్న రైల్వే ప్రయాణికులు

(టెక్కలి)

డివిజన్ కేంద్రమైన టెక్కలికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న నౌపడా రైల్వే జంక్షన్‌లో నెలకొన్న సమస్యలతో ప్రయాణికులు అనేక అవస్థలకు గురవుతున్నారు. ఈ జంక్షన్‌లో సుమారు 13 రైళ్లకు హాల్ట్ ఉండడంతో నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి ప్రయాణాలు సాగిస్తుంటారు. రైల్వే శాఖకు ఆదాయం వస్తున్నా కనీస సదుపాయాల కల్పనపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్న సదుపాయాలను కూడా ప్రయాణికులు వినియోగించుకోలేని పరిస్థితి ఇక్కడ నెలకొంది. ఈ స్టేషన్‌లో అప్పర్ క్లాస్ వెయిటింగ్ హాల్ గదులు ఎప్పుడూ తెరవడం లేదన్న విమర్శలొస్తున్నాయి. అది కూడా ప్లాట్‌ఫారానికి కింద భాగాన ఉండడంతో అవస్థలు ఎదురవుతున్నాయి. పే అండ్ యూజ్ టాయిలెట్లు ఉన్నా ఎప్పుడూ తాళాలు తెరిచిన దాఖలాలు లేవు. దీంతో ప్రయాణికులు అత్యవసర సమయాల్లో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇక అల్పాహార కేంద్రం, బుక్‌స్టాల్ వంటి సౌకర్యాలు లేవు. రైలు నిలిచేటప్పుడు ఏయే బోగీలు ఎక్కడ నిలుస్తాయో సూచించే సమాచార బోర్డులు లేవు. వర్షం వచ్చేటప్పుడు ప్రయాణికులు రైలు ఎక్కి, దిగే సమయాల్లో తడవాల్సిందే. మరోవైపు తలగాం ఎట్ నౌపడా ఆర్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ రైలు పట్టాల పైనుంచే దాటాల్సిన పరిస్థితి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అనేక పర్యాయాలు ఈకో రైల్వే అధికారులకు వినతిపత్రాలిచ్చినా స్పందించడం లేదు. ఈ జంక్షన్‌లో కోణార్క్, హిరాఖండ్, ఫలక్‌నుమా తదితర రైళ్లకు హాల్టింగ్‌లు ఇవ్వాలని కోరుతున్నా ఆ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి. ఇదిలా ఉండగా ఈ రైల్వేస్టేషన్ అమృత్ భారత్ కింద కోట్ల రూపాయలు నిధులు మంజూరైనా ఇంకా పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి మౌలిక వసతుల కల్పనతో పాటు అదనపు రైళ్లను నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతంలోని పలు గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.



నౌపడా రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం



డోర్ తీసేందుకు వీలులేకుండా ఉన్న అప్పర్, స్లీపర్ క్లాస్ వెయిటింగ్ హాల్


డీఆర్ఎంకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు (ఫైల్)

అచ్చెన్న, రామ్మోహన్ కుటుంబాలకు పలువురి పరామర్శ


అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌లను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పితాని

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు మాతృమూర్తి కళావతి మృతి చెందిన విషయం తెలుసుకుని పలు పార్టీల నేతలు బుధవారం నిమ్మాడలో అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడులను కలిసి పరామర్శించారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, గౌతు శ్యామ సుందర శివాజీ, జనసేన నాయకులు పంచకర్ల రమేష్‌బాబు, పిసిని చంద్రమోహన్, డాక్టర్ దానేటి శ్రీధర్, నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్, బీజేపీ నాయకుడు పూడి తిరుపతిరావు తదితరులు కింజరాపు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆమె మృతి తీరని లోటని వారు పేర్కొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉపాధి అవకాశాలు

నరసన్నపేట: పాలిటెక్నిక్ విద్యతో ఉపాధి అవకాశాలుంటాయని ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ అన్నెపు గోపి అన్నారు. బుధవారం పాలీసెట్‌పై ఎస్‌వీసీటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సాంకేతి విద్య చదవడం ద్వారా జీవితంలో వేగంగా ఉపాధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, రవీంద్రనాథ్, కృష్ణ, ఎస్‌వీసీటీ సభ్యులు డి.రమేష్, రామా రావు, కరుణశ్రీ, దివ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బంగారం వ్యాపారానికి ల్యాండ్ మార్కుగా నిలవాలి


సాయిబాబా పెరల్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: బంగారం వ్యాపారానికి నరసన్నపేట ల్యాండ్ మార్క్‌గా నిలవాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆకాంక్షించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో సాయిబాబా పెరల్స్ బంగారం దుకాణం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నరసన్నపేట పేరు ప్రతిష్ఠలను విస్తరించేలా వ్యాపారం చేయాలన్నారు. సాయిబాబా పెరల్స్ యాజమాన్యం 30 ఏళ్లుగా నిజాయితీగా వ్యాపారం చేయడం వల్లే వ్యాపారాన్ని విస్తరించగలిగారని అభినందించారు. కార్య క్రమంలో షాపు యాజమాన్య ప్రతినిధులు నానాజీ, గాడ్డె సోదరులు పాల్గొన్నారు.

రేపు అన్నమయ్య సంకీర్తన ఆలాపన

పలాస: తాళ్లపాక అన్నమయ్య 521వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సత్యసాయి మందిరంలో అన్నమయ్య హరిశరణాగతి సమాఖ్య ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనాలాపన, శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రఘురాం, మల్లా రామేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి శోభాయాత్ర, పది గంటలకు సంకీర్తన కార్యక్రమం జరుగుతుందని, భక్తులు హాజరుకావాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జలుమూరు: మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.దామోదరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరుగు సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచెంద్రి జంక్షన్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం మరమ్మత్తులు చేపడుతున్నందున సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.శంకర రావు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగ దారులు గమనించి సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

ఇంటింటి ప్రచారం ప్రారంభం

పలాస: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో టీడీపీ ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ప్రారంభించారు. 15వ వార్డు నెహ్రూనగర్, శ్రీనివాసనగర్, మంకినమ్మ ఆలయం తదితర వీధుల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ తదితరులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సరియాపల్లిలో..

హరిపురం: మందస మండలం సరియాపల్లి గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, క్లస్టర్ ఇన్‌చార్జి తమిరి భాస్కరరావు ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గౌతు శిరీష, ఎంపీ గా రామ్మోహన్‌నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిర్ల కృష్ణారావు, నవీన్, గుంట నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశలక్కవరం పంచాయతీలో..

సంతబొమ్మాళి: త్వరలో జగరనున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం ద్వారా రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు అందరికీ అందుతాయని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. బుధవారం ఆకాశలక్కవరం పంచాయితీ సీరపువానిపేట, సుగ్గువానిపేట గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి టీడీపీ అందించనున్న సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అచ్చెన్నాయుడు, ఎంపీగా రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పంగ అశిరి నాయుడు, సువ్వారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవుపురంలో..

నందిగాం: దేవుపురంలో బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు ఎం.బాలకృష్ణ బి.గిరిబాబు, కె.ధర్మారావు, ఎస్.లోహితాసుడు, టి.చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి: బగ్గు


జలుమూరు (సారవకోట): మాళువ గ్రామంలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న రమణమూర్తి

నరసన్నపేట/జలుమూరు (సారవకోట): టీడీపీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం నరసన్నపేట మండలం దేవాది, పోతయ్యవలస, సారవ కోట మండలం మాళువ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కలిగించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ఉమ్మడి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వానికి మద్దతు తెలిపాలని, పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నరసన్న పేట, సారవకోట మండలాల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, కత్తిరి వెంకటరమణ, రాష్ట్ర బీసీ సెల్ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్, నేతలు యాళ్ల వేణుగోపాలరావు, గొండు సూర్యారావు, సాదు చిన్నికృష్ణంనాయుడు, సురవరపు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు జగన్ వెన్నుపోటు: ఎంజీఆర్

హిరమండలం: బీసీలకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి సీఎం జగన్ అని, ఆయనను రానున్న ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు (ఎంజీఆర్) అన్నారు. బుధవారం హిరమండలం మేజర్ పంచాయతీలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లలో 74 మందిని బీసీలను చంపించిన ఘనత జగన్ రెడ్డిదేనన్నారు. అంతకుముందు హిరమండలంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథ కాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు యాళ్ల నాగేశ్వరరావు, లాడె కృష్ణ, శ్రీధర్, మకలాకర్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

హిరమండలం: సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కొత్తూరు సీఐ వేణు గోపాలరావు కోరారు. బుధవారం గులుమూరు గ్రామంలో ఎన్నికల నిబంధనలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ప్రజల మధ్య శత్రుత్వం పెరిగేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడ దన్నారు. ఓట్ల కోసం లంచం ఇవ్వడం, ప్రలోభ పెట్టడం చేయకూడదన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చూడా లన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణస్వామి, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ వేణుగోపాలరావు

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న పీడీ కూర్మారావు

ఆమదాలవలస: ఎండలు తీవ్రతరం అవుతున్నందున ఉపాధి వేతనదారులు వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐకేపీ పీడీ కూర్మారావు తెలిపారు. బుధవారం మునగవలస పంచాయతీలో మహిళా సంఘాలకు ఓటు హక్కు వినియోగించడంతో పాటు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు, పాడి రైతులు ఖాళీ ప్రదేశాల్లో చెట్ల కింద ఉండాలన్నారు. ముఖ్యంగా 50 ఏళ్లు పైబడిన మహిళలు, ఉపాధి హామీ కూలీలు కొబ్బరి నీళ్లు, మజ్జిగ, గ్లూకోజ్ వాడడంతో పాటు వైద్యుల సలహాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఇచ్ఛాపురం: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు పూర్తి స్థాయి చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ తెలిపారు. నీటి ఎద్దడి నివారణలో భాగంగా బుధవారం బాహుదానదిలో రివర్ బండ్‌ను ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించారు. నదిలో అడ్డుకట్టు వేసి నీరు వృథాగా పోకుండా నిల్వ చేసేందుకు పనులు చేపడుతున్నామని తెలిపారు. కమిషనర్‌తోపాటు ఏఈ కామేశ్వరరావు తదితరులు ఉన్నారు.


రివర్ బండ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్

ఓటు వజ్రాయుధం


బసివాడలో మానవహారం నిర్వహిస్తున్న మహిళలు

జలుమూరు: ఓటు వజ్రాయుధమని, రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును సద్వినియోగం చేసుకో వాలని వెలుగు ఏపీఎం తవిటినాయుడు అన్నారు. బసివాడ, అల్లాడ, గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లొంగ వద్దన్నారు. నచ్చిన వారికి స్వేచ్ఛగా ఓటువేసి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, సీసీలు, మహిళాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

సరుబుజ్జిలి: రావివలస గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో స్వయం శక్తి సంఘ మహిళలతో బుధవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం కమలకుమారి తన సిబ్బంది, రావివలస డ్వాక్రా మహిళలతో కలిసి ఓటు హక్కుపై ప్రజలకు చైతన్యం కల్పించారు.


ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

ఇచ్ఛాపురం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని వెలుగు ఏపీఎం సనపల ప్రసాద్ తెలిపారు. బుధవారం తులసిగాం గ్రామంలో ఓటరు నమోదుపై ప్రజలకు అవగహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఈనెల 15వ తేదీలోగా కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. శతశాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.


సరుబుజ్జిలి: అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గిట్టుబాటు లేక..!

- చింతపండు, కుంకుడు కాయల విక్రయాల్లేవ్
- ఆందోళన చెందుతున్న గిరిజన రైతులు
- పట్టించుకోని జీసీసీ అధికారులు

(మెళియాపుట్టి)

కొండలపై పంటలను సాగు చేసుకుంటూ జీవనాధారం పొందుతున్న గిరిజన రైతులు ఆశలు అడియాశ లవుతున్నాయి. ఏటా కొండల్లో అధికంగా పండించే చింతపండు, కుంకుడు కాయల విక్రయం ద్వారా కొంత ఆదాయాన్ని పొందేవారు. అయితే ఈ ఏడాది పంట దిగుబడులు వచ్చినా ధర ఆశించిన స్థాయిలో లేకపోవడంతో గిరిజన రైతులు ఆవేదనకు గురవుతున్నారు. జిల్లాలో సుమారు 70,876 హెకార్లలో అటవీ భూమి ఉంది. అయితే కొండలకు ఆనుకుని ఎక్కువ గిరిజన గ్రామాల్లోని రైతులు సాగుచూసేందుకు భూములు లేక అటవీ ఉత్పులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే పంట ఉత్పత్తులను జీసీసీ ద్వారా కొనుగోలు చేయాల్సి ఉన్నా బహిరంగ మార్కెట్‌లో ధర లేకపోవడంతో జీసీసీ అధికారులు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. దీంతో దళారులను రైతులు ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదురవు తోంది. దీనివల్ల వారు చెప్పిన ధరకు పంటలను అమ్ముకోవాల్సి వస్తోందని, తీవ్రంగా నష్టపోతు న్నామని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత ఏడాది చింతపండు కిలో రూ.70 పలుకగా ఈ ఏడాది రూ.30కు మాత్రమే అమ్మాల్సి వస్తోంది. గత ఏడాది కుంకుళ్లు కిలో రూ.50 ఉండగా ప్రస్తుతం గిరిజనుల వద్ద రూ.15 నుంచి రూ.20లకు కొనుగోలు చేస్తున్నారు. జీసీసీ ధరలతో సంబంధం లేకుండా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాల్సి ఉన్నా ఆ దిశలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ధర ఉన్నప్పుడు మాత్రం కొను గోలు చేస్తున్నారని, ధర లేకుంటే పంటలను అధికారులు కొనడం లేదని గిరిజన రైతులు వాపోతున్నారు. చింతపండుతో పాటు కుంకుడు కాయలు ఏరేందుకు రోజుకూలీ ఇచ్చుకోవాల్సి వస్తోందని, అయితే అవి అమ్మకం కాకపోవడంతో పంటను చెట్లకే వదిలేస్తున్నామని పలువురు పేర్కొంటున్నారు. అటవీ ఉత్పత్తుల సమస్యలను ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జీసీసీ అధికారులు గిట్టుబాటు ధరకు పంటలను కొనుగోలు చేసి ఆదు కోవాలని పలు గ్రామాల గిరిజన రైతులు కోరుతున్నారు.


చందనగిరిలో గిరిజనులు సేకరించిన కుంకుడు కాయలను కుప్పగా పెడుతూ..


గూడలో విక్రయం లేక ఆరబెడుతున్న చింతపండు

కొనుగోలు చేస్తున్నాం

అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం జరుగుతుంది. అందు బాటులో ఉన్న గ్రామాల్లో ఎప్పటి నుంచో కొనుగోలు చేస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్ రేట్లు గత ఏడాది కన్నా తక్కువగా ఉన్నాయి.

-నర్సింగరావు, జీసీసీ మేనేజర్, పాతపట్నం

ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావివ్వొద్దు



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



హాజరైన వివిధ శాఖల అధికారులు

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: రానున్న సార్వత్రిక ఎన్నిక నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వొద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ సూచించారు. బుధవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో ఆర్వోలు, ఏఆర్వోలు, సెక్టోరియల్ అధికారులకు నిర్వహించిన శిక్షణలో జేసీ ఎం.నవీన్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఎన్నికల అనుభవం ఉన్నవారైనా సరే మనకు తెలిసిన అంశాలను మరొక్కసారి నెమరువేసుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల నిర్వహణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి తీసుకోవడం, హోం ఓటింగ్, ఈవీఎంల పనితీరు తదితర అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. చేసే పనిపై నమ్మకం ఉంటే శత శాతం విజయం సాధించగలమని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను తెలుసుకుని, వాటి ప్రకారం ఎన్నికల విధులను నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు. ఆర్వోలు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లపై పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. ఈవీఎం నోడల్ అధికారి, జిల్లా ఉపాధి అధికారి కె.సుధ ఈవీఎం, వీవీ ప్యాట్స్ పనితీరు, బ్యాలెట్ యూనిట్, పేపర్ లోడింగ్, బ్యాటరీ అమరిక తదితర అంశాలను వివరించారు. డ్వామా పీడీ చిట్టిరాజు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ నిర్వహణ, తదితర అంశాలను వివరించారు. ఈ శిక్షణలో డీఆర్వో ఎం.గణపతిరావు, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, శ్రీకాకుళం, పలాస ఆర్డీవోలు సీహెచ్ రంగయ్య, భరత్ నాయక్, ఆర్వోలు, ఏఆర్వోలు, నోడల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు మెప్మా పీడీ కిరణ్‌కుమార్, బాలాజీ నాయక్, కె.శేషగిరి, ఎన్నికల డీటీలు, తదితరులు హాజరయ్యారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు



నిరసనలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

అరసవల్లి: విలీన మున్సిపల్ కార్మికులకు వెంటనే డివిజన్ ఏర్పాటు చేసి, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.తిరుపతిరావు, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం ఎదుట వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2017లో విలీన పంచాయతీ కార్మికులను నగర కార్పొరేషన్‌లో విలీనం చేశారని, కానీ ఇంతవరకు వారికి డివిజన్ ఏర్పాటు చేయలేదన్నారు. ముఖ్యంగా మున్సిపల్ ఆరోగ్య అధికారి ఈ విషయంతో తాత్సారం చేస్తున్నారని, ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పర్మినెంట్ కార్మికులకు ఇవ్వాల్సిన సరెండర్ లీవులు, ఇంక్రిమెంట్లు అమలు చేయాలని కోరారు. నగర పారిశుధ్య అవసరాలకు సరిపడా కార్మికులను నియమించాలని, వారికి వృత్తి పరికరాలు, రక్షణ పరికరాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. యూనిఫారాలు ఇవ్వాలని, స్టిచ్చింగ్ చార్జీలను వెంటనే చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జె.గురుమూర్తి, ఎస్.బాబూరావు, పార్థసారథి, ఆర్ గణేష్, పి.గోపి, కూర్మారావు, సింగ్, రామచంద్ర, తారక, సోగ్గాడు, రసూల్, మంగవేణి, సరస్వతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్ణయం తర్వాతే..



మాట్లాడుతున్న గుండ దంపతులు

అరసవల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయం తర్వాతే తమ నిర్ణయం తెలియజేస్తామని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి తెలిపారు. బుధవారం అరసవల్లిలోని తమ స్వగృహంలో వారు విలేకరులతో మాట్లాడారు. మూడు విడతల్లో ప్రకటించిన టికెట్ల జాబితాలో తమ పేరు లేకపోవడంతో ఎంతో ఎంతో ఆవేదనకు, ఆశ్చర్యానికి గురయ్యామన్నారు. అనంతర పరిణామాలతో పార్టీ అధినేత మమ్మల్ని పిలిపించి మాట్లాడారని, ఇక్కడి పరిస్థితిని వారికి వివరించామన్నారు. నాలుగు రోజుల్లో తన నిర్ణయాన్ని తెలియజేస్తామని చెప్పారని, అంతవరకు వేచి చూస్తామని గుండ దంపతులు స్పష్టం చేశారు. పార్టీలో గ్రూపులు కట్టడం అనేది కేన్సర్ వ్యాధిలాంటిదని, గత రెండేళ్లుగా జరుగుతున్న పరిణామాలను పార్టీ రాష్ట్ర అధ్యక్షునికి విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందన్నారు. తమను ఆదరించి, వెన్నంటి నడుస్తున్న అభిమానులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బూర్జ: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాలకొండ అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు అగ్ని ప్రమాదాలు వాటి నివారణ చర్యలపై విద్యార్థులకు వివరించారు. ద్రవ పదార్థాలు, అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు ప్రాథమిక దశలోనే నివారించే డ్రై కెమికల్ పౌడర్, కార్బన్ డైయాక్సైడ్ ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ లక్ష్మీనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరమణ, ఒకేషనల్ ఉపాధ్యాయులు నర్సింహమూర్తి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి



తనిఖీ చేస్తున్న ఎస్ఐ హరికృష్ణ

శ్రీకాకుళం క్రైం: అనుమానితులు తారసపడితే సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలని టూటౌన్ ఎస్ఐ హరికృష్ణ సూచించారు. నగర పరిధి గొంటివీధిలో బుధవారం కేంద్ర బలగాలతో ఎస్ఐ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 57 ఇళ్లల్లో సోదాలు నిర్వహించి, ధ్రువ పత్రాలు లేని 42 వాహనాలను గుర్తించినట్టు ఎస్ఐ తెలిపారు. సోదాల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అరాచక పాలనకు అంతం తప్పదు

● కూటమి అభ్యర్థి గొండు శంకర్



పథకాలను వివరిస్తున్న గొండు శంకర్ తదితరులు

అరసవల్లి: రాష్ట్రంలో ఐదేళ్లుగా సాగుతున్న జగన్‌రెడ్డి అరాచక పాలన అంతం చేయడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి శ్రీకాకుళం నియోజకవర్గ అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. బుధవారం స్థానిక 21వ డివిజన్ ఇన్‌చార్జి అంబటి లక్ష్మీరాజ్యం ఆధ్వర్యంలో కంపోస్టు కాలనీలో ప్రజాగళం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత చిన్నమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుని, అనంతరం కాలనీలో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను, వైసీపీ అరాచకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఓటమి భయంతో వైసీపీ నాయకులు ప్రతీ అంశానికి రాజకీయ కోణాన్ని ముడిపెడుతూ అబద్ధాలు చెబుతున్నారని, ఇలా ప్రజలను మోసం చేసే రోజులు ఎప్పుడో పోయాయన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు నక్క శంకరరావు, వెలమల శ్రీనివాసరావు, కరకవలస శరత్ బాబు, టీడీపీ నాయకులు కంచు దశరథ, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కోరాడ హరగోపాల్, మైలపల్లి నరసింహ మూర్తి, రెడ్డి గిరిజా శంకర్, జనసేన పార్టీ ఇన్‌చార్జి కోరాడ సర్వేశ్వరరావు, బీజేపీ నాయకులు జి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార గ్రామాల్లో పర్యటన

గార: మండలంలో పలు మత్స్యకార గ్రామాల్లో ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ బుధవారం సాయంత్రం పర్యటించారు. మొగదాలపాడు పేర్లవానిపేట, కొమరవానిపేట తదితర గ్రామాల్లో పర్యటించి స్థానిక పెద్దలు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. ఈ ప్రాంత సమస్యలపై ముఖ్యంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం శాలిహుండం కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఆ ప్రాంత ఉమ్మడి పార్టీ నాయకులు కార్యకర్తలతో అభిమానులతో కలిసి శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీసా వెంకట రమణమూర్తి, బడగల వెంకట అప్పారావు, గుండ భాస్కరరావు, గొండు వెంకట రమణమూర్తి కె.ఆదినారాయణ, కె.రమణ మహర్షి, శిమ్మ శ్రీనివాస్ కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మూడు పార్టీల శ్రేణులతో సమన్వయం



మాట్లాడుతున్న కలిశెట్టి, ఎన్ఈఆర్

రణస్థలం: టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకొని ముందుకు సాగుతున్నట్టు విజయనగరం పార్లమెంట్ స్థానం టీడీపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానం బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. బుధవారం ఇద్దరు నేతలు సంయుక్తంగా ఎన్ఈఆర్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో మూడు పార్టీల శ్రేణులు ఏకతాటిపైకి రావడం శుభ పరిణామమన్నారు. పొత్తులో భాగంగా పార్టీ హైకమాండ్స్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించారని చెప్పారు. సీనియర్ నాయకుడు కళా వెంకటరావు ఆశీస్సులు తమకు ఉన్నాయని చెప్పారు. మూడు పార్టీల మధ్య సమన్వయాన్ని విచ్ఛిన్నం చేసేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు తేలిపోయయాన్నారు. సమావేశంలో మూడు పార్టీల నాయకులు ముప్పడి సరేష్, లంక శ్యామలరావు, పిషిని జగన్నాథంనాయుడు, బెండు మల్లేశ్, రవి, డీజీఎం ఆనందరావు, పిన్నింటి బాను, బసవ గోవిందరెడ్డి, గొర్లె లక్ష్మణరావు, రౌతు శ్రీనివాసరావు, పిన్నింటి మధు, ఇజ్జాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం, ఇసుకతో రూ.లక్షల కోట్లు స్వాహా

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్రంలో సైకో సీఎం జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో తన అనుచర వర్గంతో మద్యం, ఇసుక దందా చేపట్టి ఆరు లక్షల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని స్వాహా చేయించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో టీడీపీ మహాశక్తి మహిళా కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రవికుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అఖండ విజయం టీడీపీకి తెచ్చిపెట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు తమ్మినేని గీత, బోయిన సునీత, కణితి విజయలక్ష్మీబాయ్, కూన వెంకట రాజ్యలక్ష్మి, అమ్మాజీ, కూటమి నాయకులు పేడాడ సూరప్పలనాయుడు, పేడాడ రామ్మోహన్, నూకరాజు, సనపల డిల్లీశ్వరరావు, అన్నెపు భాస్కరరావు, తమ్మినేని చంద్రశేఖర్, విద్యాసాగర్, సంపతిరావు మురళీధరరావు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మహిళల పాత్ర కీలకం

పొందూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళల పాత్ర అత్యంత కీలకమైనదని టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ మహిళా నాయకులతో ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానం, వ్యూహాలపై సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, దౌర్జన్యాలపై ప్రతీ మహిళకు వివరించాల్సిన బాధ్యత మహిళా నేతలపై ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన నియో జకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్ మండల టీడీపీ అధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, ఎంపీటీసీలు బాడాన హారిక, అనకాపల్లి వాణి, టీడీపీ నాయకులు అన్నెపు రాము, బి.శంకరభాస్కర్, బి.గిరి, ఎ.చినరంగ, సీతారామారావు, డి.గణపతి, బి.సత్యం, ఎంఎస్ఎన్ తదితంలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రవికుమార్

పొందూరు: మండల కేంద్రంలో వైసీపీ నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మండల పార్టీ అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎ.చినరంగ ఆధ్వర్యంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకుని టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనకాపల్లి సత్యం, అనకాపల్లి వెంకటరావు, అనకాపల్లి సంచెయ్య, చెల్లూరి పైడినాయుడు తదితరులతో పాటు 20 కుటుంబాలు చేరాయి.



స్వామివారి విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

రంగనాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ఎచ్చెర్ల: ఫరీద్‌పేటలో రంగనాథ స్వామి ఆలయ పునః ప్రారంభోత్సవాలు గత నాలుగు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. గత నెల 31న ప్రారంభమైన ఈ ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. ఈ మేరకు బుధవారం రంగనాథ స్వామి ప్రాణ ప్రతిష్ఠ, ధ్వజకుంభారాధన, వాస్తు ఆరాధన, మూలమంత్ర వాహనం, పంచశయ్యాధివాసం, విష్ణు సహస్రనామ పారాయణ తదితర పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో చేపట్టారు. గురువారం ద్వారాతోరణ, యంత్ర, విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విశేష అర్చన పూజలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. చినజీయర్‌స్వామి, అహోబిల జీయర్‌స్వామి పర్యవేక్షణలో రంగనాథ స్వామి మూల విరాట్ పునః ప్రతిష్ఠోత్సవం గురువారం ఉదయం 11.42 గంటలకు చేపట్టనున్న పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్రీరామ నవ రాత్రులకు శుభరాట

ఇచ్ఛాపురం: టి.బరంపురం గ్రామంలో సీతారామ ఆలయం ప్రాంగణంలో శ్రీరామ వసంత నవరాత్రుల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.. వసంత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం విజయనగరానికి చెందిన వేదపండితులు ఫణికుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా శుభరాట నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు శుభారాట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామనవమి వసంత నవరాత్రులు ఈ నెల 9వ తేదీ నుంచి తొమ్మిది రోజులపాటు జరగనున్నట్టు తెలిపారు.



శుభరాటలో పాల్గొన్న భక్తులు

రోడ్డు పక్కనే చెత్త కుప్పలు



గార: మండలంలో పెద్ద సముద్రతీర గ్రామం అయిన బందరువానిపేటలో రోడ్డు పక్కనే చెత్త కుప్పలు వేసేయండంతో దుర్గంధంగా తయారు అయ్యాయి. సుమారు ఐదు వేల జనాభా గల ఈ గ్రామంలో వీధులు దగ్గరగా ఉండడం, డ్రైనేజ్ కాలువలు లేకపోవడంతో స్థానికులు ఇళ్లలోంచి చెత్తను తెచ్చి రోడ్డు పక్కన వేయాల్సి వస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు పక్కన చెత్త కుప్పలు వల్ల అటువైపు వెళ్లే వారు ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. ఫలితంగా ఈగలు దోమలు వల్ల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, ఈ విషయమై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై నూర్పులు.. తప్పని ఇబ్బందులు

జి.సిగడాం: మండలంలోని పలువురు రైతులు ప్రమాదమని తెలిసినా రహదారులపై మొక్కజొన్న కండెలు, నువ్వులు, మినుము తదితర పంటలను నూర్పు చేస్తున్నారు. అలాగే మొక్కజొన్న గింజలు ఆరబెడుతున్నారు. దీనివల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జి.సిగడాం నుంచి పెనసాం వరకు సుమారు 10 కిలోమీటరు, అటు పున్నాం వెళ్లే వరకు సుమారు 15 కిలోమీటర్లు రహదారి పొడవునా పంటలను ఆరవేయడం, నూర్పులు చేయడం కనిపిస్తుంది. దీనివల్ల కొన్నిసార్లు ద్విచక్ర వాహనాలు బోల్తాపడి పలువురు గాయపడుతున్నారు. తమకు కల్లాలు లేకపోవడంతో రోడ్లపై నూర్పులు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల సమీపంలో..



పెనసాం రోడ్డుపైన మొక్కజొన్న గింజలు

7న ఒడియా మేథా సమ్మాన్ పరీక్ష

సోంపేట: జేసిరామచంద్రాపురం పాఠశాలలో ఒడియా మేథాసమ్మాన్ పరీక్షను ఈనెల 7వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఒడియా టీచర్స్ అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షుడు రాజేంద్ర పండా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతి చదువుతున్న ఒడియా మీడియం విద్యార్థులు పరీక్షకు హాజరుకావాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.

సత్యసాయి అంతరంగికుని మృతికి సంతాపం

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయిబాబా అంతరంగికులు ప్రొఫెసర్ కామరాజు అనిల్ కుమార్ మృతికి జిల్లా సత్యసాయి సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, జిల్లా ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రఘాడ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సృష్టి ఉన్నంత వరకు సత్యసాయి అవతారాన్ని ప్రపంచం గుర్తు పెట్టుకుంటుందని, అలాగే నిగర్వి, ప్రేమమూర్తి కామరాజు అనిల్ కుమార్‌ను ఎప్పటికి గుర్తు పెట్టుకుంటారన్నారు. బాబా ఆశయాలకు అనుగుణంగా సేవలో పాల్గొని ప్రేరణ కలిగించిన మహోన్నత వ్యక్తి కామరాజు అని లక్ష్మణరావు, ఎస్.రామచంద్రరావు తదితరులు కొనియాడారు.

ఎంపీని కలిసిన టీడీపీ నాయకులు

గార: శ్రీకూర్మం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు బుధవారం ఉదయం నిమ్మాడలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీ నాయనమ్మ ఇటీవల మరణించిన నేపథ్యంలో వారంతా వెళ్లి అచ్చెన్నను, ఎంపీను కలిసి పరామర్శించారు. శ్రీకూర్మం పంచాయతీ టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

సంగీత కళాకారునికి ఉగాది పురస్కారం



లింగమూర్తి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ పరిధి బెల్లుపడ కాలనీకి చెందిన సంగీత కళాకారుడు పరపటి లింగమూర్తి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. హైదారాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించనున్న జాతీయ రెడ్డి గర్జన సభలో ఈ పురస్కారం అందించనున్నట్టు గర్జన సభ ఆర్గనైజర్ గుర్రం పాపిరెడ్డి సమాచారం అందినట్టు లింగమూర్తి బుధవారం తెలిపారు. లింగమూర్తి ఎంపికపై మండల మున్సిపాల్టీ కళాకారులు, స్నేహితులు ధనుంజయరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కన్వర్జ్ 2కే24 ఉత్సవ్ ప్రారంభం

ఎచ్చెర్ల: స్థానిక ఓ ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న కన్వర్జ్ 2కే24 సాంకేతిక ఉత్సవ్ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా విద్యార్థులు బ్రాంచ్‌ల వారీగా రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. పవర్ పాయింట్, పోస్టర్ ప్రజెంటేషన్ ద్వారా ఆవిష్కరణల ప్రాధాన్యతను వివరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవ్‌ల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయవచ్చన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జెమ్స్‌కు అరుదైన గుర్తింపు



అవార్డు అందుకుంటున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: రాగోలులోని జెమ్స్ వైద్య కళాశాలకు అరుదైన గుర్తింపు లభించింది. శస్త్ర చికిత్స వైద్య కళాశాలల్లో రెండు శతాబ్దాల చరిత్ర కలిగి ప్రపంచంలోనే పేరొందిన లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇంగ్లాండ్ కళాశాల నుంచి అక్రిడేషన్ లభించింది. భారత దేశంలో ఈ గుర్తింపు పొందిన తొలి కళాశాలగా జెమ్స్ నిలిచింది. ఈ సందర్భంగా జెమ్స్ యాజమాన్యాన్ని ప్రముఖ అంకాలజిస్ట్, పద్మశ్రీ డాక్టర్ రఘురాం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చీఫ్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ.. గతేడాది రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ బృందం తమ కళాశాలను సందర్శించి ఇక్కడ బోధన, వైద్య అభ్యసనా పద్ధతులు, సదుపాయలు, ఆపరేషన్ థియేటర్లు తదితరాలు పరిశీలించి ఈ గుర్తింపు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జెమ్స్ సీఈవో బొల్లినేని ఆద్విక్, సీఏవో ఎస్.రామ్మోహన్, ప్రిన్సిపాల్ లక్ష్మీలలిత, మెడికల్ సూపరింటెండెంట్స్ అశోక్‌రెడ్డి, శ్రీనివాసులు, జనరల్ మెడిసన్ డిపార్ట్‌మెంట్ హెడ్ కనుగుల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతుగా నిలవండి

కంచిలి: రాష్ట్ర భవిష్యత్ బాగుపడాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలంతా మద్దతు తెలపాలని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బంగారు కురయ్య, మాదిన రామారావు అన్నారు. మండలంలోని ఎక్కలా పంచాయతీ పరిధిలోని ఎక్కల, అర్జునాపురం గ్రామాల్లో బుధవారం ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టీవీ రమణ, మర్రిపాటి పూర్ణ, కె.చంద్రశేఖర్, లక్ష్మి, కిషోర్ పాడీ, పిలక చినబాబు, సనపల కామేష్, బొడ్డ రామ్‌కుమార్, రవికుమార్, అప్పారావు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రెబల్‌గా పోటీ చేస్తా

రణస్థలం: వైసీపీ రెబల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎచ్చెర్ల నుంచి పోటీ చేస్తానని ఆ పార్టీ నాయకుడు పైడి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం ఎంతో కృషి చేశానని, అయినా తగిన గుర్తింపు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేసి ఎచ్చెర్ల నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్టు స్పష్టం చేశారు. స్థానిక యువతకు ఉపాధికల్పన కోసం, తోటపల్లి, మడ్డువలస కాలువ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

అల్లెనలో ప్రచారం

బూర్జ: రానున్న ఎన్నికల్లో వైసీపీను అఖండ మెజార్టీతో గెలిపించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. అల్లెన పంచాయతీలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసీపీ అందించిన పథకాలపై వివరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.